# మా భూమిని కబ్జా చేస్తుండ్రు..

- కలెక్టరేట్ ప్రజావాణికి 43 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మా భూమిని కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని అందోల్ మండలం కొడెకల్ గ్రామానికి చెందిన చాకలి చంద్రకళ, చాకలి యాదమ్మ అధికారులతో మొరపెట్టుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రతివారం నిర్వహించే ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 43 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు ఫిర్యాదులను అధికారులకు అందజేసి సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో కొడేకల్ బాధితులు తమ అర్జీని అధికారులకు అందజేస్తూ వివిధ సర్వే నెంబర్లలో ఉన్న తమ భూమిని ఇతరులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తాము సంగారెడ్డిలో ఉంటున్నందున, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు భూమిలో పనులకు ఆటంకం కలిగిస్తున్నారని, వెళ్తే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు వివరించారు. భూమికి సంబంధించిన పట్టా పాసు పుస్తకం, డాక్యుమెంట్ కాపీలను అధికారులకు అందజేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



బొంతపల్లిలో బీఆర్ఎస్ దివంగత నేత గౌరీశంకర్ గౌడ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, ఆదర్శ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు

## ఉద్యమకారుడిని కోల్పోవడం బాధాకరం

దశదిన కర్మలో గౌరీశంకర్‌కు నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి17:బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఉప్పనూతుల గౌరీశంకర్ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో దివంగతులయ్యారు. గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి వార్డులోని వీరభద్రనగర్ కాలనీలో సోమవారం గౌరీశంకర్ స్వగృహంలో దశదిన కర్మ నిర్వహించారు. దీనికి మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఫరూఖ్‌హుస్సేన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గౌరీ శంకర్‌గౌడ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీరితోపాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామచంద్రాపూర్ ఆదర్శ్‌రెడ్డి, జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, గుమ్మడిదల నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్ మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్ రెడ్డి, రవీందర్, రాజశేఖర్, జయశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సురభీనాగేందర్ గౌడ్ తదితరులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పలువురు ఆయన గతంలో తెలంగాణ కోసం ఉద్యమించిన పోరాటాలు, బీఆర్ఎస్ బలోపేతానికి చేసిన విశేష కృషిని కొనియాడారు. ఆయన లేనిలోటు పార్టీకి తీవ్రనష్టం అన్నారు. వారి కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఓదార్చారు. గౌరీ శంకర్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుంద మాజీ ఎమ్మెల్సీ హామీనిచ్చారు. మాజీ వైస్‌ఎంపీపీ నక్క మంజులావెంకటేశ్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నరహరి, ప్రతాప్‌రెడ్డి, చక్రపాణి, గ్యారల మల్లేశ్, కావలి శంకర్‌యాదవ్, గోపాల్, వినోద్‌గౌడ్, బీరప్ప, కుమ్మరి వెంకటేశ్, మందభాస్కర్‌రెడ్డి,సురభి నవీన్ గౌడ్, ఎల్లయ్య, షాన్‌పాషా పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌పై ప్రచారం చేయాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 17: జాతీయ లోక్ అదాలత్‌పై ప్రచారం చేయాలని జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ అన్నారు. సోమవారం జహీరాబాద్‌లోని మున్సిఫ్ కోర్టు ఆవరణలో పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 8వ తేదీన జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలపై కక్షిదారులు, బాధితులకు అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీమార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మానేన్న, జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, జక్కుల హనుమంతు, న్యాయవాదులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ లీకేజీతో బీరప్ప బస్తీ రోడ్డుపై నిలిచిన మిషన్ భగీరథ నీరు

## మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతో కాలనీ బురదమయం

జిన్నారం, ఫిబ్రవరి 17: మండుటెండల్లో కాలనీ రోడ్లపైకి చేరిన నీరు కాలువలను తలపిస్తోంది. వివరాల్లోకి వెళితే..బొల్లారం మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు బీరప్ప బస్తి న్యూబస్టాండ్ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ సోమవారం లీక్ అయింది. దీంతో 40 నిమిషాల పాటు భారీగా తాగునీరు కాలనీ రోడ్లపైకి చేరి బురదమయంగా మారింది. రాకపోకలకు బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గడప స్థాయి వరకు నీరు చేరడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే పైప్‌లైన్ లీకేజీలు జరుగుతున్నాయని వాపోయారు.మున్సిపల్,హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లోపంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని, సకాలంలో స్పందించి మంచినీటి వృథాను అరికట్టాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

## తడి, పొడి చెత్తను వేరుగా అందించాలి



మాట్లాడుతున్న కమిషనర్ ఉమమహేశ్వర్

జహీరాబాద్, ఫిబ్రవరి 17: తడి,పొడి చెత్తను వేరుచేసి వీధుల్లోకి వచ్చే స్వచ్ఛ వాహనాలకు అందించాలని జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఉమమహేశ్వర్‌రావు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల యజమానులకు తడి,పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ చెత్తను సేకరించేందుకు వచ్చే వాహనాలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి వేర్వేరుగా అందించకుంటే రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వ్యాపారాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించాలన్నారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది తనిఖీకు వచ్చే సమయంలో కనిపిస్తే రూ.1,000 జరిమానా విధించడమే కాకుండా లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నాచారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలన్నారు.

## 541 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్, ఫిబ్రవరి 17: ప్రభుత్వం పేదలకు అందించే (పీడీఎస్) బియ్యాన్ని సోమవారం సివిల్ సప్లై అధికారులు, చిరాగ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రాజేందర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు(కేఏ56 సీ2629)లారీలో 275 క్వింటాళ్లు, (టీఎస్07యూఎఫ్ 9799) మరో లారీలో 266 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద సివిల్ సప్లై అధికారులు, పోలీసులు కలిసి వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఆయా లారీల్లో అక్రమంగా తరలిస్తున్న మొత్తం 541 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని దిగ్వాల్ గోదాముకు తరలించారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న యజమానులు మహమ్మద్ మన్సూర్, మహమ్మద్ జాకీర్, లారీల డ్రైవర్లు మహమ్మద్ పాషా, భీమయ్యలను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.



అందోల్: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



హత్నూర: దౌల్తాబాద్‌లో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి కలెక్టరేట్: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## ఘనంగా కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు

తెలంగాణ రాష్ట్ర సాధకుడు,బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజును సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. పట్టణాలతోపాటు గ్రామగ్రామాన కేక్‌లు కట్‌చేసి మిఠాయిలు తినిపించుకున్నారు. బీఆర్ఎస్ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, యువకులు పెద్దసంఖ్యలో రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తదానం చేశారు. కేసీఆర్ పేరిట ఆలయాల్లో అభిషేకాలు చేయడంతోపాటు దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేసి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలందరూ కోరుకుంటున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి రాష్ట్ర రూపురేఖలను మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ పాలన కావాలని ప్రజలందరూ కోరుతున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు. వేడుకల్లో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

న్యూస్ నెట్‌వర్క్, సంగారెడ్డి, ఫిబ్రవరి 17



జహీరాబాద్: జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు



జహీరాబాద్: మల్గి మల్లన్నస్వామి ఆలయ ఆవరణలో కేసీఆర్ పేరిట మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు



వట్‌పల్లిలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఝరాసంగం: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా వైదిక పాఠశాల విద్యార్థులకు రాత పుస్తకాలు అందజేసిన నామ స్రవంతీరవికిరణ్



పటాన్‌చెరు: కృషి డిఫెన్స్‌కాలనీలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతున్న నాయకులు



జిన్నారం: గిరిజన గురుకుల పాఠశాల ఆవరణలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్క నాటుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



ఆర్సీపురంలో మొక్కలు నాటిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి



మునిపల్లి: మగ్దంపల్లిలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు



సదాశివపేట: కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అమీన్‌పూర్‌లో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పటాన్‌చెరు: కృషి డిఫెన్స్‌కాలనీలో కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటుతున్న నాయకులు



నారాయణఖేడ్: కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రక్తదానం చేస్తున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నగేశ్, ఏరియా దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నారాయణఖేడ్: బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న శ్రేణులు




జిన్నారం: బొల్లారం డిజైర్ సొసైటీలో చిన్నారులతో కలిసి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి



జిన్నారం: నల్తూరులో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా రైతులతో కలిసి సంబురాలు జరుపుకొంటున్న బీఆర్ఎస్ నాయకులు



రాయికోడ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



గుమ్మడిదల: బొంతపల్లి హైస్కూల్‌లో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహిస్తున్న నియోజకవర్గ నాయకులు

## విద్యార్థులకు పదోతరగతి కీలకం



భెల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 17: జీవితంలో నిలదొక్కుకోవాలంటే పదోతరగతి కీలకమని కలెక్టర్ వల్లూరు క్రాంతి విద్యార్థులకు సూచించారు. సోమవారం భెల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. జీవితంలో ఏ విధంగా స్థిరపడాలని అనుకుంటున్నారో ఆ ఆలోచనకు ఇప్పుడే అంకురార్పణ చేసుకోవాలని, పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంతో రాయాలన్నారు. పదోతరగతి జీవితంలో నిలదొక్కుకునేందుకు టర్నింగ్ పాయింట్ అని, ఈ సమయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాల్లో నిలబడి ఇతరులకు స్ఫూర్తి గా నిలవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంతో చదువుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో పీపీరాథోడ్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి



తహసీల్ ఆఫీసును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

హత్నూర, ఫిబ్రవరి17: ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం హత్నూర తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించడంతోపాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. భూ సమస్యల పరిష్కారంతోపాటు ఆయా ధృవపత్రాల కోసం వచ్చే వారికి సకాలంలో జారీ చేయాలన్నారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదులపై స్పందించాలని అధికారులకు సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేస్తున్న పోలింగ్‌కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫర్హీన్‌షేక్, డిప్యూటీ తహసీల్దార్ దావూద్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం ఫిబ్రవరి 17: బొల్లారం పారిశ్రామికవాడలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ 3లో క్లాంప్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ మాధవరావు, ఏఈ రామకృష్ణారెడ్డి సంయుక్తంగా తెలిపారు. విద్యుత్ అంతరాయానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

### బిల్లులు చెల్లిస్తేనే విధులు

కోహీర్, ఫిబ్రవరి 17: ఆయా గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలిగింపు, ట్రాక్టర్ కోసం ఇంధనం కొనుగోలు, కార్మికుల ఖర్చుల బిల్లులు చెల్లిస్తేనే విధులు నిర్వహిస్తామని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో భారతికి వినతిపత్రం సమర్పించారు. పంచాయతీలకు బిల్లులు చెల్లించకుంటే మార్చి 1 నుంచి విధులకు దూరంగా ఉంటామన్నారు. ఆగస్టు నుంచి చెక్కులు డ్రా కావడం లేదన్నారు. దీంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీవో వినోద్‌కుమార్ ఉన్నారు.

### ప్రభుత్వ భూముల పరిశీలన

జహీరాబాద్, ఫిబ్రవరి 17: జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలంలోని పార్వతాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూములను ట్రైనీ కలెక్టర్ మనోజ్, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి పరిశీలించారు. సోమవారం గ్రామంలో ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలు ఉన్నాయి, రైతులు పంటలను ఎన్ని ఎకరాల్లో సాగు చేసుకుంటున్నారు...ఎన్ని ఎకరాలు అన్యాక్రాంతానికి గురయ్యాయి అనే వివరాలను తెలుసుకున్నారు. అటవీ భూములను పరిశీలించారు. తహసీల్దార్ హసీనాబేగం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయికిరణ్ ఉన్నారు.

### ఘనంగా బీరప్పస్వామి జాతర

రామచంద్రాపురం, ఫిబ్రవరి17: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో బీరప్ప జాతర వైభవంగా జరుగుతుంది. సోమవారం బీరప్పస్వామి కల్యాణమహోత్సవంతోపాటు అగ్నిగుండం, బండ్లు తిరుగుట తదితర వేడుకలు జరిగాయి. గ్రామంలోని కురుమ సంఘం సభ్యులు, గ్రామస్తులందరూ జాతరలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జాతరలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాల్వగడ్డ రాజ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, కొమురయ్య, కురుమసంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

కోహీర్, ఫిబ్రవరి17: మండలంలోని గొటిగార్‌పల్లి దియోది కేంద్రం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఎస్సై సతీశ్ వర్మ కథనం ప్రకారం...జహీరాబాద్ మండలంలోని అర్జున్‌నాయక్ తండాకు చెందిన రాథోడ్ శంకర్(25), జాటోత్ పవన్(26) కలిసి సిద్దాపూర్ తండాలో ఉన్న బంధువుల వద్దకు బైక్‌పై బయలుదేరారు. గొటిగార్‌పల్లి దియోది కేంద్రం సమీపంలోకి రాగానే తాండూర్ నుంచి జహీరాబాద్ వస్తున్న ఆర్టీసీ బస్సు వారి బైకును ఢీకొట్టింది. దీంతో రాథోడ్ శంకర్ తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే చనిపోయాడు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న జాటోత్ పవన్‌ను జహీరాబాద్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. జహీరాబాద్ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మేకల కొట్టం దగ్ధం...15 మేకలు మృతి

అందోల్, ఫిబ్రవరి17: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మేకలు కొట్టం దగ్ధం కావడంతో 15 మేకలు మృతి చెందగా మరో 5 మేకలకు గాయాలపాలయ్యాయి. మండల పరిధిలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన లలిత మేకలను కొట్టంలో కట్టేసి నిద్రపోయింది. రాత్రి సమయంలో కొట్టంలో మంటలు చెలరేగి 15 మేకలు మృతి చెందగా 5 మేకలకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట ఎస్సై పాండు తెలిపారు. ప్రమాదవశాత్తు జరిగిందా..? లేక ఎవరైన తగులబెట్టారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మటన్ దుకాణం సీజ్..కేసు నమోదు

అందోల్, ఫిబ్రవరి 17: నేరడిగుంట చౌరస్తాలో కొద్ది రోజులుగా చనిపోయిన గొర్రెలు, మేకల మాంసం విక్రయిస్తున్న దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి దుకాణాన్ని సీజ్ చేశామని నేరడిగుంట పంచాయతీ కార్యదర్శి స్వామి తెలిపారు. కొద్ది రోజులుగా నేరడిగుంట చౌరస్తాలో ముజాహిద్ అనే వ్యకి దుకాణంలో చనిపోయిన గొర్రెలు, మేకల మాంసం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు వచ్చింది. గ్రామస్తులు వారంక్రితం అతడి వద్ద చనిపోయిన జీవాలు కూడా పట్టుకున్నారు. దీంతో అతడిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతోపాటు ఎంపీవో సోమనారాయణతో కలిసి దుకాణాన్ని సీజ్ చేయశారు. ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## భూ విక్రయంలో మోసం చేసిన ఇద్దరిపై కేసు

సిర్గాపూర్, ఫిబ్రవరి 17: భూమిని తప్పుగా చూపి విక్రయించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాధాకృష్ణ కు వంగ్దాల్ శివారులో సర్వే నెంబర్ 41/ఏలో 3.30 ఎకరాల భూమిని బానోత్ లక్ష్మణ్, ప్రేమ్‌సాగర్ చూపగా రూ. 51లక్షలకు కొనుగోలు చేశారు. అనంతరం భూమి కబ్జా కోసం వెళ్లగా అక్కడున్న రైతు నాది అని తెలపడంతో, అసలు భూమి గురించి విచారణ చేయగా పనికిరాని భూమి చూపించి మోసం చేశారని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్ఐ వివరించారు. రోడ్డు పక్కన తక్కువ ధరకు వస్తుందని నమ్మి మోసపోవద్దన్నారు.